క్లుప్తంగా

వారంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో దరఖాస్తు చేసుకున్న రైతులకు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను వారం లోపు ఏర్పాటు చేస్తున్నామని ఎస్‌ఈ విజయన్ పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో జిల్లాకు చెందిన విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లతో గురువారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. విద్యుత్ బిల్లింగ్ ప్రక్రియను ప్రతి నెలా ఏడులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. జియో ట్యాగింగ్ సిస్టమ్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సబ్‌స్టేషన్ల మెయింటె నెన్స్‌ను క్రమం తప్పకుండా చేపట్టాలని చెప్పారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సంబంధించిన రైతుల ఆధార్, మొబైల్ నంబర్లను లింక్ చేయాలని కోరారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, అసిస్టెంట్ ఇంజినీర్ కల్పన, అనిల్, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అక్షతల శోభాయాత్ర



నేత్రపర్వంగా సాగుతున్న శోభాయాత్ర

కోవూరు : మండల పరిధిలోని కొత్తూరులో అయోధ్య అక్షతల శోభాయాత్రను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత గ్రామంలోని కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో అయోధ్య అక్షతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల నడుమ గ్రామవీధుల్లో శోభాయాత్ర నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు ఇంటింటికీ వెళ్లి అక్షతల ప్యాకెట్లను అందజేశారు.

19 నుంచి కులగణన



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

కోవూరు : మండల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఈ నెల 19వ తేదీ నుంచి కులగణన చేపడుతున్నట్లు ఎంపీడీఓ శ్రీహరి అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణనను వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా చేపట్టాల్సి ఉంటుందన్నారు. ప్రజలు కూడా పూర్తిస్థాయిలో సహకరించి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ నాగూర్‌వలీ, మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, వివిధ శాఖల ఏఈలు జగదీష్, మాధవయ్య, ఏపీఎం వెంకటస్వామి, ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్, ఎంఈఓలు రహీమ్, చెంచులక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



విడవలూరు : మండలంలోని రామతీర్థం, చౌకచర్ల గ్రామాల్లో ఎరువుల దుకాణాలను పొదలకూరు ఏడీఏ శివనాయక్ గురువారం తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులను రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి పి.వెంకటకృష్ణయ్య ఉన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

మనుబోలు : సంక్రాంతి సందర్భంగా ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై అజయ్‌కుమార్ హెచ్చరించారు. మనుబోలు పోలీస్‌స్టేషన్‌లో ఆయన గురువారం మాట్లాడారు. సంక్రాంతిని సాంప్రదాయబద్ధంగా కుటుంబాలతో కలిసి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్సీపీదే గెలుపు

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: మాజీ సీఎం చంద్రబాబును ప్రజలు నమ్మడం లేదని, వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 33వ డివిజన్లోని నేతాజీ నగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనను గురువారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఏ మాత్రం తగ్గనని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు ఉండవన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం అయితేనే పథకాలు కొనసాగుతాయని చెప్పారు. ప్రతిపక్షాలు తనపై అసత్య ప్రచారం చేస్తున్నాయని, ఇది సమంజసం కాదని హితవు పలికారు. తాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అనంతరం డివిజన్లోని పలు ప్రాంతాలకు చెందిన 50 కుటుంబాలు ఎంపీ సమక్షంలో పార్టీలో చేరాయి. వీరికి ఎంపీ, మేయర్ స్రవంతి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, బీసీ విభాగ రాష్ట్ర నేత హరిబాబు యాదవ్, డివిజన్ ఇన్‌చార్జిలు మేఘనాథ్‌సింగ్, ప్రభాకర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి, స్వర్ణా జీవన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని బర్వాడి పాళెం సెంటర్‌లో అంబేడ్కర్, భారత రాజ్యాంగం అనే పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. రచయిత గోడ రమణయ్య అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మందా బాబ్జీ ఆధ్వర్యంలో వీటిని అందజేశారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): మితిమీరిన వేగంతో వెళ్తున్న బైక్ అదుపు తప్పడంతో వాహనచోదకుడు తీవ్రంగా గాయపడిన ఘటన ఎన్టీఆర్‌నగర్ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాళేనికి చెందిన నాగసుబ్రహ్మణ్యం బంధువులు తిరుపతిలో ఉన్నారు. ఈ క్రమంలో పని నిమిత్తం బైక్‌పై ఒంటరిగా తిరుపతికి బుధవారం బయల్దేరారు. ఈ తరుణంలో ఎన్టీఆర్‌నగర్ సమీపంలోని జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పడంతో కిందపడి తలకు తీవ్రగాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. ఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం నగరంలోని అపోలో హాస్పిటల్‌కు తరలించారు. అతని వద్ద బ్యాగ్‌ను పరిశీలించగా, అందులో రూ.ఆరు లక్షల నగదు, రెండు సెల్ ఫోన్లను గమనించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై నాగసుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు నార్త్ ట్రాఫిక్ ఎస్సై గీతారామ్మ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డే ఓబన్నకు నివాళులు



నెల్లూరు (వేదాయపాళెం): జేమ్స్ గార్డెన్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలను వడ్డెర వృత్తిదారుల సంఘ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘ కన్వీనర్ గుంజి దయాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓబన్న చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడారు. 39 ఏళ్ల వయస్సులోనే బ్రిటిష్ వారి చేతుల్లో వీరమరణం పొందిన వ్యక్తి ఓబన్న అని కొనియాడారు. చేతివృత్తుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు, వడ్డెర వృత్తిదారుల సంఘ జిల్లా నేతలు బెల్లంకొండ బాలవెంకటేశ్వర్లు, తిరుపాల్, బెల్లంకొండ నానీ, మస్తానయ్య, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావో.. బేటీ పడావోపై శిక్షణ



డైరీని ఆవిష్కరిస్తున్న అధికారులు

నెల్లూరు (వేదాయపాళెం): మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా సంతపేటలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో బేటీ బచావో... బేటీ పడావోపై ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు శిక్షణ కార్యక్రమాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్ఓ పెంచలయ్య మాట్లాడారు. బేటీ బచావో... బేటీ పడావో కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు కృషి చేయాలని సూచించారు. అనంతరం డైరీని ఆవిష్కరించారు. రిసోర్స్ పర్సన్ రమేష్, నరసింహరావు, శ్రీనివాసరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు మాధవి, బీబీఏ సభ్యులు చంద్రశేఖర్‌రావు, సీజేడబ్ల్యూఎస్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డీసీపీఓ సురేష్, డీఐఓ సలీమా తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఆందోళన



నెల్లూరు (లీగల్): భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా నెల్లూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఆందోళనను గురువారం చేపట్టారు. భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని నినాదాలు చేస్తూ ఆర్టీసీ బస్టాండ్ వరకు ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం మానవహారాన్ని చేపట్టారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆందోళన కమిటీ కన్వీనర్ బ్రహ్మం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్యాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అంకయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య కోరారు. సంతపేటలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఏపీ విద్యుత్ మీటర్ రీడర్ల కార్యాచరణ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. మీటర్ రీడర్లకు వేతనాలను నేరుగా చెల్లించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని చెప్పారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా హజరత్ వలీ, అధ్యక్షుడిగా సాల్మన్‌బాబు, కోశాధికారిగా బాలకృష్ణ ఎన్నికయ్యారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్‌కిశోర్, కృష్ణ మున్నా తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో సంక్రాంతి సంబరాలను శనివారం నిర్వహించనున్నామని శాంతి కల్చరల్స్ అధినేత అమానుల్లాఖాన్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నర్తకి సెంటర్‌లో గురువారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ముగ్గులు, పాటలు, నృత్య పోటీలను నిర్వహించనున్నామని చెప్పారు. విజేతలకు బహుమతులను అందజేయనున్నామని, పాల్గొనాలనుకునే వారు 91820 79796 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కేతా సుబ్బారావు, మధుసూదన్, రాధాకృష్ణ, నాగరాజు, వంశీకృష్ణారెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

భరోసా కల్పించి.. ఆకలి తీర్చి

- అర్జీదారుడిపై మానవత్వం చూపిన కలెక్టర్



బాధితుడు చీకుర్తి వెంకటరావు

నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టరేట్‌కు రెవెన్యూ సమస్యపై వచ్చిన ఓ అర్జీదారుడితో కలెక్టర్ హరినారాయణన్ మానవతా దృక్పథంతో స్పందించారు. సమస్యను పరిష్కరిస్తానని భరోసా కల్పించడమే కాకుండా భోజనానికి నగదును అందజేసి ఓదార్పునిచ్చారు. జలదంకికి చెందిన చీకుర్తి వెంకటరావు రెవెన్యూ సమస్యపై కలెక్టరేట్‌కు గురువారం వచ్చారు. మధ్యాహ్నం కలెక్టర్ తన ఛాంబర్ నుంచి ఇంటికెళ్తున్న సమయంలో కారు వద్దకు చేరుకొని తన సమస్యను పరిష్కరించాలని దీనంగా వేడుకున్నాడు. అప్పటికే కారులో కూర్చున్న కలెక్టర్ చలించిపోయి దిగి వచ్చి అర్జీని పరిశీలించారు. ఈ నెల 18న కావలి ఆర్డీఓ, జలదంకి తహసీల్దార్‌ను పిలిపిస్తానని, ఆ సమయంలో వస్తే పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. అనంతరం భోజనం చేశావా అని అర్జీదారుడ్ని ఆరా తీసి.. తన జేబులోని నగదును అందజేసి భోజనం చేసి వెళ్లాలని ఓదార్పునిచ్చారు.

'ధ్రువీకరణ పత్రమివ్వలేదు'

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయం నుంచి ముఖ్య కార్యనిర్వహణాధికారి ద్వారా నెల్లూరులోని కలాన్ మసీదుకు చెందిన భూమి సర్వే నంబర్ 542లో 6.03 సెంట్లకు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాన్ని ఈ నెల మూడున ఐజీ స్టాంప్స్, రిజిస్ట్రేషన్స్ శాఖకు అందజేశారని అసత్య ప్రచారం జరుగుతోందని, ఎలాంటి పత్రాలివ్వలేదని వక్ఫ్ బోర్డు సీఈఓ అబ్దుల్ ఖాద్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నంబర్ 542లో నెల్లూరు సిటీ, కలాన్ మసీదు నెల్లూరుకు చెందినట్లుగా రాష్ట్ర గెజిట్ నంబర్ 18 – ఏ, 02.05.1962 తేదీలో ప్రచురించారని తెలియజేశారు. ప్రచారంలో ఉన్న నిరభ్యంతర లేఖ పూర్తిగా అవాస్తవమని, ప్రజలెవరూ మోసపోవద్దని కోరారు. ఈ విషయమై విజయవాడ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులపై దాడి

నెల్లూరు రూరల్: వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు, సిబ్బందిపై కొందరు దాడికి పాల్పడిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. విద్యార్థులపై రౌడీషీటర్లు దాడికి పాల్పడగా, సిబ్బంది అడ్డొచ్చారు. దీంతో వీరిపై సైతం దాడికి పాల్పడ్డారు. కాగా ఈ విషయమై ప్రిన్సిపల్‌ను సంప్రదించగా, దాడి జరిగిన మాట వాస్తవమేనని చెప్పారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

'కేఎన్నార్' ఉపాధ్యాయుడికి అవార్డు

నెల్లూరు రూరల్: బీవీనగర్‌లోని కేఎన్నార్ స్కూల్ ఎస్జీటీ ఉపాధ్యాయుడు నరేంద్రకు ఏపీ సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఏలూరులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సంక్రాంతి కవితల పోటీలకు ఈ సత్కారం లభించింది.

'ఎస్వీఎస్' స్కూల్లో సంబరాలు



నెల్లూరు రూరల్: శ్రామికనగర్‌లోని ఎస్వీఎస్ స్కూల్లో సంక్రాంతి సంబరాలను గురువారం నిర్వహించారు. విద్యార్థులకు ఆటలు, పతంగుల పోటీలను జరిపారు. విద్యార్థుల తల్లులకు రంగవల్లుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. బాలభవన్ నెల్లూరు డైరెక్టర్ సుభద్రాదేవి, కరస్పాండెంట్ వెంకటేశ్వర్లురెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఓటర్ల తుది జాబితా ప్రక్రియ

- కమిషనర్ వికాస్ మర్మత్



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): అందిన 6, 7, 8 ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి తుది ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియను పూర్తి చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో ఎన్నికల విభాగ సిబ్బందితో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 6, 7, 8 ఫారాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తుది ఓటరు జాబితాను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జాబితా రూపకల్పన ప్రక్రియలో ఏమైనా సాంకేతిక సమస్యలు ఏర్పడితే ఏఈఆర్వోలు, ఎన్నికల సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఏఈఆర్వోలు దేవీకుమారి, శ్రీనివాసులు, నిర్మలా నందబాబా, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై నగరంలో ప్రచార వాహనం, శిబిరాల ద్వారా అవగాహన క్యాంపులను శుక్రవారం నిర్వహించనున్నామని, ఎక్కువ సంఖ్యలో ప్రజలు పాల్గొని రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వీఆర్సీ మైదాన సమీపంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం వద్ద మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం ఐదు వరకు శిబిరాలను నిర్వహించనున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం, అవగాహన, అర్హుల రిజిస్ట్రేషన్, ఆధార్ అప్‌డేట్, బ్యాంకుల ద్వారా అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు తదితర కార్యక్రమాలను చేపట్టనున్నారని వెల్లడించారు.

ఎల్‌హెచ్ఎమ్మెస్ సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): సంక్రాంతి సందర్భంగా ఊళ్లకెళ్లేవారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్ఎమ్మెస్) సేవలను వినియోగించుకోవాలని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడారు. విలువైన వస్తువులు, నగదును సాధ్యమైనంత వరకు బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో పోలీస్ శాఖ రూపొందించిన ఎల్‌హెచ్ఎమ్మెస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఊళ్లకెళ్లే సమయంలో రిక్వెస్ట్ పోలీస్ వాచ్‌ను ఎంపిక చేయాలని.. ఏ తేదీన.. ఏ సమయానికి వెళ్తున్నారు.. తిరిగెప్పుడొస్తారనే వివరాలను యాప్‌లో పొందుపర్చాలని కోరారు. వెంటనే ఈ సమాచారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌కు వెళ్తుందని, సదరు ఇంట్లో నిఘా కెమెరాలను సిబ్బంది అమర్చుతారన్నారు. ఇంట్లో ఎలాంటి కదలికలున్నా కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సైరన్ మోగుతుందని, వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్, రక్షక్, బ్లూకోల్ట్స్ సిబ్బందికి సమాచారం వెళ్తుందని వివరించారు. దీంతో నిమిషాల వ్యవధిలోనే అక్కడికి చేరుకొని దొంగలను పట్టుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సంక్రాంతి సందర్భంగా జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైద్యురాలికి సత్కారం



నెల్లూరు రూరల్: పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సంక్రాంతి సంబరాలను జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ప్రస్తుత సీజన్లో ఈఎన్టీపై సీనియర్ సిటిజన్లు పాటించాల్సిన జాగ్రత్తలను వైద్యురాలు లకుమాదేవి వివరించారు. అనంతరం మహిళలకు రంగవల్లుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. వైద్యురాలితో పాటు అసోసియేషన్ అధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి, బలరామనాయుడ్ని సత్కరించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఖాజామస్తాన్, చెంచయ్య, ప్రసాద్, మేరీబెస్లింగ్టన్, ఎస్తేరురాణి, సుజన, హరిసుధ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలన



నెల్లూరు(బారకాసు): విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణను పురస్కరించుకొని సామాజిక సమతా సంకల్పంలో భాగంగా నగరంలోని చిల్డ్రన్స్‌పార్కులో అంబేడ్కర్ జీవిత చరిత్ర, చిత్రపటాల ప్రదర్శనను గురువారం ఏర్పాటు చేశారు. ప్రదర్శనను మేయర్ స్రవంతి, కమిషనర్ వికాస్ మర్మత్ వీక్షించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమానికి హాజరయ్యారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, దేవీకుమారి, టీపీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల అందజేత



నెల్లూరు(బృందావనం): సుబేదారుపేటలోని మేరీ నాయుడివీధిలో పేదలకు దుప్పట్లు, దుస్తులను గురువారం పంపిణీ చేశారు. ఏవీకే ఫౌండేషన్, కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించామని సుబ్బారావు తెలిపారు. అనంతరం రంగవల్లుల పోటీలను నిర్వహించారు. జగన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి మినహాయింపునివ్వాలని వినతి



డీఆర్వోకు వినతిపత్రమిస్తున్న బీటీఏ నేతలు

నెల్లూరు(దర్గామిట్ట): యాభై ఏళ్లపైబడిన.. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు.. బాలింతలను ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని బీటీఏ నేతలు కోరారు. ఈ మేరకు డీఆర్వో లవన్నకు వినతిపత్రాన్ని గురువారం సమర్పించారు. బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, ఆర్థిక కార్యదర్శి రఘు, రాజశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.



విధుల్లోకి పారిశుధ్య కార్మికులు

సమస్యలను పరిష్కరించాలంటూ 16 రోజులుగా సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు ఆందోళనను బుధవారం వీడారు. వీరి డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో సమ్మెను తాత్కాలికంగా విరమించారు. దీంతో పారిశుధ్య కార్మికులు విధులకు గురువారం హాజరయ్యారు. చెత్త సేకరణతో పాటు పరిసరాలను పరిశుభ్రం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

– నెల్లూరు(బారకాసు)



